సాక్షి ప్రకాశం

గురువారం । 11 । జూలై । 2024



దిగుబడి అంతంత మాత్రమే

మామిడి సీజన్ చివరి దశకు చేరుకుంది. ఈ ఏడాది ధరలు కాస్త పరవాలేదనుకున్నా దిగుబడులు దారుణంగా పడిపోయాయి. దీంతో రైతులకు నష్టాలే మిగిలాయి. - 8లో..



డెంగీ ప్రబలకుండా చర్యలు

డెంగీ ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

11 నుంచి రంగభూమి ఏడో వార్షికోత్సవం

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఒంగోలు వారి ఆధ్వర్యంలో ప్రతినెలా రెండో శనివారం చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల ఏడో వార్షికోత్సవాన్ని జూలై 11, 12, 13 తేదీల్లో ఒంగోలులో నిర్వహిస్తున్నారు. 11వ తేదీ ఉదయం 9 గంటలకు ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జాతీయ స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహిస్తారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు సీవీఎన్ రీడింగ్ రూంలో కరణం సురేష్ మెమోరియల్ గుంటూరు వారి 'సీవే' నాటిక, రాత్రి 9 గంటలకు తిరుమల ఆర్ట్స్ గుంటూరి వారి 'చీకట్లో చిందులాట' హాస్యనాటిక ప్రదర్శిస్తారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు సీవీఎన్ క్లబ్ ఆవరణలో ఏడో వార్షికోత్సవ సభ జరుగుతుంది. ఈ సభలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాటక రంగ ప్రముఖులు పాల్గొంటున్నారు. కళాకారులు, కళాపోషకులు, ప్రజలంతా పాల్గొని ఈ కార్యక్రమాలు జయప్రదం చేయాలని జిల్లా రంగభూమి కళాకారుల సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో కోరారు.

రూ.160కి కందిపప్పు

ఒంగోలు అర్బన్: ధరల నియంత్రణలో భాగంగా పౌరసరఫరాల శాఖ మిల్లర్స్, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో జరిపిన చర్చల అనంతరం ప్రజలకు దేశవాళీ కందిపప్పు రూ.160, స్టీమ్ రైస్ బీపీటీ రకం కేజీ రూ.49, రా రైస్ కేజీ రూ.48 చొప్పున ప్రజలకు అందజేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నగరంలో లాయర్‌పేట, దిబ్బల రోడ్డు, కొత్తపట్నం బస్టాండ్ వద్ద ఉన్న రైతు బజార్లలో, రామనగర్ 7వ లేన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ వద్ద నిర్దేశించిన రేట్లకు సరఫరా చేస్తారని పేర్కొన్నారు. మరో రెండు రోజుల్లో జిల్లాలోని అన్నీ బిగ్ చైన్ మార్కెట్లలో కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షునిగా వెంకటేశ్వర్లు

మార్కాపురం టౌన్: మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షునిగా తనను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం రామారావు నియామక పత్రాలు పంపినట్లు గొట్టిముక్కల వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాల మహానాడు కార్యకర్తలు తనకు సహకరించాలని కోరారు. బాధ్యతగా పనిచేస్తానని, మాల మహానాడు కార్యకర్తలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

ఫిషింగ్ హార్బర్‌కు స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

కొత్తపట్నం: ఫిషింగ్ హార్బర్‌కు స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. పిన్నింటివారిపాలెం, కె.పల్లెపాలెం మధ్యలో సర్వే నంబర్ 586/25లో 17.54 ఎకరాలు అందుకోసం కేటాయించారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో ఫిషింగ్ హార్బర్ మంజూరైంది. కె.పల్లెపాలెం ఎదురు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అయితే కె.పల్లెపాలెం గ్రామస్తులు ఫిషింగ్ హార్బర్ మాకొద్దని నిరాకరించారు. దీంతో కె.పల్లెపాలెం, పిన్నింటివారిపాలెం మధ్యలోకి మార్చారు. దానికి రూ.400 కోట్లు బాలినేని మంజూరు చేయించారు. దీనిని పరిశీలించడానికి జాయింట్ కలెక్టర్ వచ్చారు. మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్ కుమార్, వీఆర్వో జిలాని ఉన్నారు.

వొకేషనల్ కోర్సుల్లో దృష్టి సారించాలి

కొత్తపట్నం: వొకేషనల్ కోర్సులపై దృష్టి సారిస్తే జీవితంలో స్థిరపడటానికి నూరు శాతం ఉపయోగముందని రాష్ట్ర వొకేషనల్ కోఆర్డినేటర్ బి.భారతి అన్నారు. వొకేషనల్ కోర్సు వివరాలపై బుధవారం వివిధ పాఠశాలలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల కిట్స్ స్టాక్ పాయింట్స్ పరిశీలించారు. కొత్తపట్నంలో బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. వొకేషనల్ కోర్సుల గురించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మోటుమాలలో కేజీబీవీ సందర్శించి విద్యార్థులందరికీ కిట్స్ అందాయా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రూమును పరిశీలించారు. 9, 10వ తరగతి విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి సీబీఎస్ సిలబస్ గురించి వివరించారు. పరీక్షలకు ఏ విధంగా సిద్ధం కావాలో సూచనలిచ్చారు. ఈతముక్కల హైస్కూల్‌ను సందర్శించి వొకేషనల్ కోర్సు గురించి విద్యార్థులకు వివరించారు. ఆమె వెంట ఎంఈవో-2 టి.పద్మావతి ఉన్నారు.

ఉచితమంటూనే వాత



ఒంగోలు మార్కెట్ యార్డ్ ఆవరణలోని దంపింగ్ కేంద్రం నుంచి ఇసుకను టిప్పర్‌లకు, ట్రాక్టర్లకు నింపుతున్న దృశ్యం

- ఉచితమంటూ గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం
- రవాణా చార్జీలు తడిసిమోపెడు
- జిల్లా వ్యాప్తంగా మూడు స్టాకు పాయింట్లు మాత్రమే
- గత ప్రభుత్వంలో నియోజకవర్గాల వారీగా స్టాకు పాయింట్లు ఏర్పాటు చేసిన వైనం

అన్నా.. ఓ ట్రక్ ఇసుక కావాలి.
ఎక్కడికన్నా..
పేర్నమిట్ట వరకే.. ఎంతవుతుంది?
అన్నా.. నాలుగు వేలు పడుతుంది..
అదేంటన్నా
ఐదు కి.మీల దూరానికే అంత రేటా?
రూ.4 వేలకు రూపాయి కూడా తగ్గదన్నా..
ఇదీ.. ప్రస్తుతం ఒంగోలులో పరిస్థితి..
ఎన్నికలప్పుడు ఫ్రీ ఇసుక అంటూ కూటమి నేతలు ఊదరగొట్టారు.. అధికారంలోకి రాగానే నాలుక మడతేశారు. ఉచితం సంగతి అటుంచితే.. స్టాక్ పాయింట్లలో గత ప్రభుత్వం నిల్వ ఉంచిన ఇసుకను టన్నుల లెక్క ధర నిర్ణయించి విక్రయిస్తోంది. నిన్నటి వరకూ ఇసుక కొనుగోలు భారమంటూ ప్రచారం చేసిన కూటమి నేతలు.. గద్దెనెక్కగానే వ్యాపారానికి తెరలేపారు. భారాన్ని మోపుతూనే ఉచితంగా ఇసుక ఇస్తున్నామంటూ ప్రచారం చేసుకోవడాన్ని చూసి విస్తుపోవడం ప్రజల వంతయింది. ప్రస్తుతం జిల్లాలోని మూడు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే జనానికి తలకు మించిన భారంగా పరిణమించింది. ఒక వైపు రవాణా చార్జీల భారం.. మరో వైపు గంటలు, రోజుల కొద్దీ నిరీక్షణతో నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఇసుక కావాలంటే గత ప్రభుత్వం కంటే ఎక్కువ ధర పెట్టి కొనాల్సి వస్తోందని వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

సాక్షి,నెట్‌వర్క్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక అక్రమాలకు చెక్ పెడుతూ ఓ పాలసీ తెచ్చింది. ఇసుక కొనుగోలుకు నేరుగా ఎవరూ రీచ్‌ల్లోకి వెళ్లకుండా, మైనింగ్ శాఖ పర్యవేక్షణలో ఇసుక తవ్వి, యార్డులలో నిల్వ చేసింది. అక్కడి నుంచి వినియోగదారులు ఇసుక కొనుగోలు చేసేలా విధివిధానాలు రూపొందించింది. ఇసుక పాలసీ తీసుకురావడమే కాక ఇసుక అక్రమరవాణాకు అడ్డుకట్ట వేసింది. ఇసుకను విక్రయం ద్వారా వచ్చే ప్రతి రూపాయిని ప్రభుత్వ ఖజానాకు చేర్చింది. 2014-2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలు ‘ఇసుక ఉచితం’ పేరుతో రీచ్‌లను దోచేశారు. సామాన్య కార్యకర్త దగ్గర నుంచి నియోజకవర్గ నేత వరకూ అందరూ రూ.కోట్లు కొల్లగొట్టేశారు. వాటన్నింటికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇటీవల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

వినియోగదారులకు తడిసి మోపెడు..

కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఇసుక పాలసీతో వినియోగదారులకు తడిసి మోపెడవుతోంది. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక అని ప్రకటించగానే భవన నిర్మాణదారులు, కూలీలు తొలుత సంబరపడ్డారు. ధర రవ్వంతైనా తగ్గకపోవడంతో వారి ఆశలు ఇట్టే ఆవిరయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 8 నియోజకవర్గాలలో నలుమూలల సమాన దూరంలో ఇసుక డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసింది. అయితే అన్ని రీచ్‌ల్లో ఇసుక టన్ను ధర రూ.475గా నిర్ణయించింది. నియోజకవర్గ కేంద్రాల నుంచి సమీప ప్రాంతాలకు తరలించే ఇసుక ధరలు దూరాన్ని బట్టి రవాణా చార్జీలతో కలిపి ధరలు నిర్ణయించింది. అయితే కూటమి ప్రభుత్వం కేవలం జిల్లా వ్యాప్తంగా మూడు స్టాకు పాయింట్లను మాత్రమే ఏర్పాటు చేసింది. జరుగుమల్లి మండలం చతుకుపాడులో రెండు, ఒంగోలులో ఒక స్టాక్ పాయింట్‌నే పెట్టింది. ఈ నెల 8వ తేదీ నుంచి ఇసుక పాలసీని అమల్లోకి తెచ్చి, టన్ను ధర రూ.247 నిర్ణయించింది. ఈ లెక్కన రవాణా చార్జీలతో కలిపి ట్రాక్టర్ ఇసుక రూ.4 వేల నుంచి రూ.4,500 పలుకుతోంది. ట్రాక్టర్ ట్రక్కులో 4 టన్నుల ఇసుక పడుతుందని, కానీ స్టాక్ పాయింట్లలో మాత్రం 5 టన్నుల లెక్కన డబ్బు వసూలు చేస్తుండటంపై వినియోగదారులు పెదవి విరుస్తున్నారు.

- మార్కాపురానికి విజయవాడ, నెల్లూరు, కడప ప్రాంతాల నుంచి ఇసుక తెప్పించి టన్ను రూ.1300 నుంచి రూ.1400కు విక్రయిస్తున్నారు. ఇక్కడి నుంచి పక్క గ్రామాలకు ఇసుక తరలించాలంటే దూరాన్ని బట్టి మళ్లీ రవాణా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన 20 టన్నుల ఇసుక మార్కాపురంలో 28 వేలకు లభిస్తే, ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సుమారు రూ.35 వేలు ఖర్చవుతోంది.
- చతుకుపాడు స్టాక్ పాయింట్ల వద్ద మంగళవారం 5 టన్నుల ఇసుక ధర రూ.1,235 వసూలు చేశారు. బుధవారం మాత్రం ట్రాక్టరులో ఇసుక ఎక్కువ పోస్తున్నామని చెప్పి రూ.1,350 వసూలు చేయడంతో వినియోగదారులు ఖంగుతిన్నారు. ప్రస్తుతం కొండపి, పచ్చవ ప్రాంతాలకు ట్రక్కు ఇసుక రూ.3 వేలు, సింగరాయకొండ, టంగుటూరు తదితర ప్రాంతాల వారికి రూ.4 వేలకు లభిస్తోంది.
- ఎన్నికలకు ముందు సింగరాయకొండ, టంగుటూరు ప్రాంతాల్లో ట్రాక్టరు ఇసుక సుమారు రూ.2,300 నుంచి రూ.2,500కు లభించగా, ఎన్నికల కౌంటింగ్ తరువాత రూ.3 వేలకు చేరింది. ఇప్పుడు సుమారు 3,500 నుంచి రూ.4 వేలు పలుకుతోంది. గతంలో ఇంతకన్నా ధరకు ఇసుక లభించిందని, చంద్రబాబు ఉచితంగా ఇస్తానని చెప్పి ఈ రకంగా డబ్బు వసూలు చేయడమేంటని భవన నిర్మాణదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

యథేచ్ఛగా ఇసుక దందా

ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద మాత్రం ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే రూ.2 లక్షల జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష అని ఫ్లెక్సీలు పెట్టారు. కానీ జరుగుమల్లి, చింతలపాలెం, కె.బిట్రగుంట రీచ్‌ల నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఈ దందా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో సాగుతుండటంతో రెవెన్యూ, సెబ్, మైనింగ్ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రవాణా భారం.. ఇదిగో ఇలా..

జిల్లాలోని వినియోగదారులు గతంలో నెల్లూరు జిల్లాలోని పల్లిపాడు, మర్రిపాడు నుంచి నేరుగా ఎంత కావాలన్నా ఇసుక కొనుగోలు చేసేవారు. ఒంగోలులోని స్టాక్ పాయింట్ ద్వారా కొనేవారు. ఇసుక రవాణాకుగాను టిప్పర్లు, రిటర్న్‌లో ఉన్న 40 టన్నుల కెపాసిటీ లారీలను బాడుగకు మాట్లాడుకునేవారు. టన్ను ఇసుక గత ప్రభుత్వంలో రూ.475 లెక్కన 30 టన్నుల ఇసుకకు రూ.14,250 చెల్లించి, రవాణా చార్జీ రూ.15,750తో కలిపి రూ.30 వేలకు దర్శి, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంత ప్రజలు తెచ్చుకునే వారు. అలాగే ముండ్లమూరు మండలం పోలవరంలో 30 టన్నుల ఇసుక రూ.14 వేలలోపే అందజేశారు. ప్రస్తుతం నెల్లూరులో టన్ను ఇసుక ధర రూ.370 తీసుకుంటున్నప్పటికీ ఆధార్ కార్డుపై ఒకరికి 20 టన్నులు మాత్రమే ఇస్తున్నారు. 20 టన్నుల ఇసుక రూ.7,400, బాడుగ రూ.15,750తో కలిపి మొత్తం రూ.23,150 చెల్లించాల్సి వస్తోంది. గతంతో పోలిస్తే 20 టన్నులకు రూ.3150 అధిక ధర చెల్లించాల్సి వస్తోంది.



సతుకుపాడు స్టాక్‌పాయింట్ వద్ద ఉన్న అధికారులు

బాబు ఉచిత డప్పు.. తమ్ముళ్లు లేపేశారు ఇసుక డంపు

ఎన్నికల ఫలితాలకు ముందు చతుకుపాడు-1 స్టాక్ పాయింట్ లో సుమారు 25 వేల మెట్రిక్ టన్నులు, సతుకుపాడు-2 స్టాక్ పాయింట్‌లో సుమారు 50 వేల టన్నులు ఇసుక నిల్వలు ఉన్నాయని అధికారులు, జేపీ కన్‌స్ట్రక్షన్ సిబ్బంది తెలిపారు. కానీ ఉచిత ఇసుక విధానం ప్రకటించిన 8వ తేదీ నాటికి ఇసుక నిల్వలు చతుకుపాడు-1 లో 16,044 టన్నులు, సతుకుపాడు-2 స్టాక్ పాయింట్ లో 24,972 టన్నులు మాత్రమే ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. వాస్తవానికి ఎన్నికల ఫలితాలు ప్రకటన విడుదల అయినప్పటి నుంచి స్టాక్‌పాయింట్ల వద్ద ఇసుకను అక్రమంగా టిడిపి శ్రేణులు భారీగా తరలించారు. ఈ విషయం తెలిసి సెబ్ అధికారులు వెళితే దాడులు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. దీంతో సెబ్ అధికారులు ఆ ప్రక్కకు కూడా చూడకుండా తమకు మామూళ్లు ఇవ్వని ట్రాక్టర్లును ఆపి జరిమానా విధించేవారని ట్రాక్టరు యజమానులు ఆరోపిస్తున్నారు.



ముండ్లమూరు మండలంలో ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ (ఫైల్)



సతుకుపాడు స్టాక్‌పాయింట్ వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు



ఒంగోలు మార్కెట్ యార్డ్ ఆవరణలోని దంపింగ్ కేంద్రం నుంచి ఇసుకను టిప్పర్లకు, ట్రాక్టర్లకు నింపుతున్న దృశ్యం

నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- టీడీపీ వర్గీయులుగా మారుతున్న అధికారులు
- కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే తాటిపర్తి



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు బొకే అందచేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: టీడీపీ వర్గీయులుగా అధికారులు వ్యవహరిస్తున్నారని, చిరుద్యోగులపై వారు ఉక్కుపాదం మోపుతున్నారని, నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి తాత్కాలిక ఉద్యోగులు ఆందోళన చెందకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన కలెక్టర్‌ను కలిసి నియోజకవర్గంలో జరుగుతున్న పరిస్థితులపై వినతి పత్రం అందజేశారు. కొన్ని నెలలుగా నియోజకవర్గంలో నీటి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ నిధులను వెంటనే విడుదల చేయించాలని ఆయన కోరారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే ఏజెన్సీల యాప్‌ను క్లోజ్ చేశారని, కొత్తగా యాప్‌ను ఏర్పాటు చేసి సర్పంచ్‌ల తీర్మానం లేకుండా నీటిని సరఫరా చేసేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అనధికారిక అనుమతులు ఇచ్చారని, ఈ యాప్ కూడా పనిచేయకపోవడంతో గ్రామాల్లో నీటి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. దీని వలన ప్రజలు తాగు నీటికోసం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలల్లో పనిచేసే కుకింగ్ ఏజెన్సీలు, ఉపాధి పనులు చేయించే ఫీల్డ్ అసిస్టెంట్‌లు, రేషన్ షాపు డీలర్లకు ఆయా శాఖలకు చెందిన అధికారులు స్వయంగా ఫోన్‌లు చేసి రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటువంటి సంఘటనలపై చర్యలు తీసుకోవాలని కోరారు. యర్రగొండపాలెంలో ఎస్సీ హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఎస్టీ, బీసీ హాస్టళ్లల్లో ఎస్సీ విద్యార్థులు చేరే అవకాశం ఉన్నా సంబంధిత వార్డెన్లు వారిని అనుమతించడం లేదని, వెంటనే చర్య తీసుకొని ఆయా హాస్టళ్లల్లో ఎస్సీ విద్యార్థులకు ప్రవేశం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు.

టీడీపీ వర్గీయుల ప్రోద్బలంతో అక్రమ కేసులు:
టీడీపీ వర్గీయుల ప్రోద్బలంతో నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఎస్పీ సుమిత్ గరుడ్ సునీల్‌తో కలిసి చర్చించినట్లు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. ఎన్నికల సమయంలో పుల్లలచెరువు మండలంలోని శతకోడులో జరిగిన అల్లర్లను ఆసరాగా తీసుకొని అధికార పార్టీకి చెందిన నాయకులు 12 మందిపై అక్రమ కేసులు బనాయింపచేసి వారిపై రౌడీ షీటర్లు ఓపెన్ చేయించారని, ఈ సంఘటనపై విచారణ జరిపి వెంటనే కేసులు ఎత్తివేయించాలని కోరానని, ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఉద్యానవన పంటల పరిశీలన



డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న బృందం

కొండపి (సింగరాయకొండ): మండలంలోని వెన్నూరు గ్రామంలోని మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా సాగుచేస్తున్న ఉద్యానవనాన్ని మంగళవారం జలశక్తి అభియన్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు రైతులను అడిగి పంటల నాణ్యత, దిగుబడి, ఖర్చుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో బృంద సభ్యులు ఉక్కు మంత్రిత్వశాఖ డైరెక్టర్, జలశక్తి అభియన్ నోడల్ ఆఫీసర్ దేవిదత్త సతపతి, సైంటిస్ట్ సంతోష్ గౌతమ్, డ్వామా పీడి అర్జున్ రావు, డ్వామా అడిషనల్ పీడీ, కొండపి ఎంపీడీఓ నాగమణి, ఏపీఓ మహాలక్ష్మి తదితరులు ఉన్నారు.

అమృత సరోవర్ ట్యాంకును పరిశీలించిన కేంద్ర బృందం
జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం చింతలపాలెంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అమృత సరోవర్ ట్యాంకును బుధవారం మధ్యాహ్నం కేంద్ర బృందం సభ్యులు కేంద్ర ఉక్కు గనుల శాఖ డైరెక్టర్, జలశక్తి అభియాన్ నోడల్ అధికారి దేవిదత్తా సతపతి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. తరువాత జలశక్తి మిషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీటి కొళాయిలను పరిశీలించారు. కేంద్రబృందం సభ్యులు హైదరాబాద్ సీజీడబ్ల్యూబీ సంతోష్ గౌతమ్, డ్వామా పీడీ అర్జునరావు, ఒంగోలు ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో జలజాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఏపీఓ నాగరాజు, ఈవోఆర్‌డీ అంజలీదేవి, సర్పంచ్ హరిబాబు, ఎంపీటీసీ మల్లీశ్వరి, కార్యదర్శి కిషోర్‌బాబు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

- డీఆర్డీఏ పీడీ టి.వసుంధర హెచ్చరిక



ఏరియా కో ఆర్డినేటర్లతో సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ వసుంధర

ఒంగోలు టౌన్: అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీఏ పీడీ టి.వసుంధర హెచ్చరించారు. బుధవారం జిల్లాలోని ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎం, సీసీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీనిధి బకాయిలు రోజురోజుకీ ఎక్కువైపోతున్నాయని, స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం ద్వారా బకాయిలు రాబట్టాలని ఆదేశించారు. గ్రూపులు, సభ్యుల వారీగా చెల్లించాల్సిన బకాయిల వివరాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. బకాయిలు రాకపోవడానికి కారణాలు ఏమిటో ఎస్‌హెచ్‌జీ సభ్యులతో మాట్లాడి తెలుసుకోవాలని, ప్రణాళికబద్ధంగా బకాయిలు వసూళ్లు చేయాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ఇస్తున్న ఉన్నతి రుణాలను సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, అలాగే రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలని చెప్పారు. ఆడిట్‌ను పారదర్శకంగా చేయాలని, ఆడియో రిమార్కులు ఎప్పటికప్పుడు సరిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇన్సూరెన్స్, పెళ్లి కానుక పథకాలపై సభ్యులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈనెల నుంచి ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీలోపు ఎస్‌హెచ్‌జీ సమావేశాలు నిర్వహించాలని, 16 నుంచి 23 వరకు గ్రామ సంఘం సమావేశాలను ఏర్పాటు చేయాలని, 23 నుంచి 30వ తేదీలోపు మండల సమైక్య సమావేశాలను నిర్వహించాలని తెలిపారు. సమావేశాల్లో పీఎంఈజీపీ, ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజస్, సీడ్ కాపిటల్ కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డీపీఎంలు, ఏరియా కో ఆర్డినేటర్లు, పీఎం, సీసీలు పాల్గొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.365



పొదిలి బోర్డులో వేలానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర బుధవారం గరిష్టంగా కేజీ రూ.365 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో 2293 బేళ్లు రాగా, 1883 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 410 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 102వ రోజు వేలం పాటలో 1313 బేళ్లు రాగా 1039 వ్యాపారులు కొనుగోలు చేశారు. 274 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.365, కనిష్టంగా రూ.205 సరాసరి రూ.217.66 వచ్చింది. వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 978వ రోజు వేలం పాటలో 980 బేళ్లు రాగా, 844 బేళ్లు కొనుగోలయ్యాయి. 136 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.359, కనిష్ట ధర రూ.203, సరాసరి రూ.300.70 పలికింది.

క్లుప్తంగా

బాలిక ఆత్మహత్య

మేదరమెట్ల: ఓ బాలిక ఇంటి నుంచి బయటకు వచ్చి మరో వ్యక్తితో కలసి ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఏమైందో ఏమో కానీ మంగళవారం రాత్రి చెట్టుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేదరమెట్లలో బుధవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిరతాని పాడు నరశింగసాగర్ గ్రామం పాల్వంచి మండలం ఖమ్మం జిల్లాకు చెందిన సోడె కమల (14) అనే బాలిక రెండు నెలల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చి అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తితో కలసి కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల పాత గుంటూరు రోడ్డు లో ఓ ఇంట్లో ఉంటూ స్లాబు వేసే పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. ఏమైందో ఏమో కానీ మంగళవారం సాయంత్రం అక్కడే ఉన్న చెట్టుకు చీరతో ఉరివేసుకొని బాలిక ఆత్మహత్య చేసుకుంది. రాత్రి అయినా బాలిక కనిపించకపోవడంతో తోటివారు సమీపంలో వెతకగా చెట్టుకు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సాయంతో కిందికి దించి చూడగా అప్పటికే కమల మృతి చెంది ఉంది. దీంతో మేదరమెట్ల పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు బాలిక బంధువులకు సమాచారం అందచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసు ఛేదించిన పోలీసులు

- నిందితురాలు అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ రంగనాథ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: మండల పరిధిలో విమానాల రన్‌వే సమీపంలో జాతీయరహదారిపై ఈనెల 6వ తేదీ తెల్లవారుజామున జరిగిన దేవరకొండ గోపి(35) హత్య కేసును ఛేదించినట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ వివరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వివరించారు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణం మార్స్‌పేటలోని మఠం బజారులో నివసిస్తున్న మొగిలిలక్ష్మి జాతీయరహదారి పక్కన వ్యభిచార వృత్తి చేస్తూ జీవించేది. ఈమెతో గోపి గత 9 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. గత కొద్ది నెలలుగా లక్ష్మితో బుస్సా నాగరాజు స్నేహం పెంచుకుని కలిసి ఉంటున్నాడు. దీంతో గోపి తరుచూ వీరిద్దరితో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈనెల 5వ తేది రాత్రి లక్ష్మి, నాగరాజు ఇద్దరు జాతీయరహదారి పక్కన ఉన్న ఏఎస్‌ఆర్ హోటల్ వద్ద ఉండగా గోపి వారితో గొడవ పడ్డాడు. తిరిగి 6వ తేదీ తెల్లవారుజామున గోపి గొడవపడగా.. ఆ సమయంలో ఎవ్వరు లేకపోవడంతో ఇదే అదునుగా గోపిని తొలగించుకునే ఉద్దేశంతో తుమ్మ మొద్దుతో గోపి తలపై లక్ష్మి బాదడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. అనంతరం వీరిద్దరూ లారీ ఎక్కి పరారయ్యారు. బుధవారం సాయంత్రం లక్ష్మి ఉత్తర బైపాస్ రోడ్డు ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉందన్న సమాచారంతో అరెస్టు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని సీఐ రంగనాథ్ వివరించారు. కేసును ఛేదించటానికి ఎస్పీ గరుడ్ సుమిత్, డీఎస్పీ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడిమని, తక్కువ సమయంలో ఛేదించినట్లు సీఐ వివరించారు. ఎస్సై టి.శ్రీరాం పాల్గొన్నారు.

ధర సరే.. దిగుబడి అంతంతమాత్రమే..!

- చివరి దశకు మామిడి సీజన్
- భారీగా తగ్గిన దిగుబడులు, ఊరటనిచ్చిన ధరలు
- ఎకరాకి టన్ను మాత్రమే సరాసరి దిగుబడులు
- టన్ను రూ.లక్ష వరకు పలికిన కవర్ కట్టిన నాణ్యమైన కాయలు
- దిగుబడులు లేకపోవడంతో నష్టాలే మిగిలాయంటూ రైతుల ఆవేదన


చెట్టుకు నామ మాత్రంగా ఉన్నా కాయలు


మామిడి కాయలు


కవర్ కట్టిన కాయ నాణ్యత ఇలా

కందుకూరు: లాభమో, నష్టమో అర్థం కాని పరిస్థితుల్లో మామిడి సీజన్ క్రమంగా ముగింపు దశకు చేరుకుంది. మామిడి కాయల అమ్మకాలు చివరి దశకు చేరుకున్నా ఈ ఏడాది కూడా రైతులకు మాత్రం పూర్తి సంతోషం లేకుండా పోయింది. ఈ ఏడాది ధరలు కాస్త పర్వాలేదనిపించినా దిగుబడులు మాత్రం దారుణంగా పడిపోయాయి. దీంతో మార్కెట్‌లో కాయలకు డిమాండ్ ఉన్నా రైతులకు మాత్రం ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో ఏడాదిని నష్టాలతో ముగించాల్సి వచ్చిందని బాధను వెలిబుచ్చుతున్నారు.

దారుణంగా తగ్గిన దిగుబడులు

మామిడి సీజన్‌కు కందుకూరు ప్రాంతం రాష్ట్ర వ్యాప్తంగా ఫేమస్. నియోజకవర్గంలోని ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో పండే మామిడికి ఎక్కడలేని క్రేజ్ ఉంటుంది. సీజన్ వచ్చిందని ఉలవపాడు మామిడి బ్రాండ్ పేరుతో అమ్మకాలు జోరుగా సాగుతాయి. మామిడి ప్రియులు కూడా అంతే ఇష్టంతో ఉలవపాడు మామిడి కాయలను ప్రత్యేక ఆర్డర్‌లు పెట్టి మరీ కొనుగోలు చేస్తుంటారు. కానీ గత రెండు, మూడు సీజన్‌ల నుంచి రైతులు భారీగా నష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల బెడదతో దిగుబడులు సక్రమంగా లేక దిగాలు పడుతున్నారు. ఇదే కోవలో ఈ సీజన్‌లో కూడా దిగుబడులు లేక రైతులు దారుణంగా దెబ్బతిన్నారు. ప్రధానంగా కందుకూరు నియోజకవర్గంలో 15వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. వీటిలో ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో అత్యధికంగా తోటలు ఉండగా, లింగసముద్రం, వలేటివారిపాలెం, కందుకూరు మండలాల్లో అక్కడక్కడా నామమాత్రంగా తోటలు ఉన్నాయి. అయితే కొంత కాలంగా తోటల్లో దిగుబడులు సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని సక్రమంగా అనుకూలిస్తే సాధారణంగా ఎకరాకి సరాసరిన 4 టన్నుల వరకు కాయ దిగుబడి వస్తుంది. అయితే ఏడాది ఎకరాకి కేవలం టన్నుకాయ మాత్రమే దిగుబడి వచ్చిందని ఉద్యానవనశాఖ అధికారులు అంచనా వేశారు. సీజన్ ప్రారంభంలో చోటు చేసుకున్న వాతావరణ మార్పులు దీనికి ప్రధానకారణమని భావిస్తున్నారు. దీని వల్ల కౌలుకు తోటలు తీసుకున్న రైతులతో పాటు, యజమానులు కూడా తీవ్రంగా నష్టపోయారు. ఏడాది ఒక్కసారి మాత్రమే వచ్చే కాపు కావడంతో ఆదాయాలపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. కాని దిగుబడులు ఒక్కసారిగా పడిపోవడంతో రైతులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

ధరలు ఆశాజనకం

దిగుబడులు తగ్గినా ఈ ఏడాది రేట్లు మాత్రం ఆశాజనకంగా ఉన్నాయి. కాయ నాణ్యతను బట్టి వ్యాపారులు భారీ ధరలు చెల్లించి కొనుగోలు చేశారు. బంగినపల్లి నాణ్యమైన కాయలను టన్ను రూ.లక్ష వరకు చెల్లించి మరీ కొనుగోలు చేశారు. కాస్త మీడియం గ్రేడ్ రకం కాయలను సైతం టన్ను రూ.70 వేల నుంచి రూ.80వేల వరకు కూడా కొనుగోలు చేశారు. సరాసరిన టన్ను ఈ ఏడాది రూ.50వేలు అమ్మినట్లు ఉద్యానవనశాఖ అధికారులు చెప్తున్నారు. ప్రధానంగా పండుఈగ వంటి తెగుళ్ల సోకకుండా కవర్ కట్టిన కాయల నాణ్యత బాగుందని, ఈ కాయల కోసం వ్యాపారులు పోటీ పడిమరీ కొనుగోలు చేసినట్లు చెప్తున్నారు. ఈ కాయలను విదేశాలకు కొందరు వ్యాపారులు ఎగుమతులు చేశారని చెప్తున్నారు. మొత్తానికి ధరలు ఉన్నా దిగుబడులు లేకపోవడంతో రైతులు సీజన్‌ను నిరాశతో ముగించాల్సి వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

> **ధరలు ఆశాజనకంగా ఉన్నాయి**
>
> ఈ ఏడాది మామిడి సీజన్‌లో నాణ్యత బాగున్న కాయలు టన్ను రూ.లక్ష వరకు ధర వచ్చింది. కవర్ కట్టిన కాయల ధర బాగుంది. అందుకే రానున్న సీజన్‌కు రైతులకు అవగాహన కల్పించి కవర్‌లు ఎక్కువగా కట్టే విధంగా కృషి చేస్తాం. పండు ఈగ తెగులు ఉధృతి కూడా కాస్త తగ్గింది. కానీ వాతావరణం అనుకూలించకపోవడం వల్ల దిగుబడులు తగ్గాయి. రైతులు తోటలు తొలగిస్తున్న మాట వాస్తవమే. కొందరు పునరుద్ధరిస్తుండగా, మరికొందరు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్తున్నారు. తోటల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాం.
>
> బ్రహ్మసాయి, ఉద్యానవనశాఖ అధికారి

తోటల తొలగింపు

వరుస నష్టాలు వస్తుండడంతో మామిడి తోటలను తొలగించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. చాలా ప్రాంతాల్లో తోటలను విపరీతంగా కొట్టి వేస్తున్నారు. మామిడికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. గత రెండు ఏళ్ల నుంచి ఈ ధోరణి అధికంగా కనిపిస్తుంది, ఉలవపాడు, గుడ్లూరు మండలాలతో పాటు కందుకూరు మండలంలోను రైతులు తోటలను తొలగిస్తున్నారు. గత రెండేళ్లలో 150 నుంచి 200 ఎకరాల్లో తోటలను రైతులు నరికివేశారు. అయితే కొందరు రైతులు ముదురు తోటలను తొలగించి తిరిగి మొక్కలు పెంచే ప్రయత్నం చేస్తుండగా మరికొందరు రైతులు మాత్రం మిరప, శెనగ, పత్తి వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.

కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలి

మార్కాపురం: కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా నాయకుడు జి. సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని విభాగాల కార్మికులపై రాజకీయ వేధింపులు ప్రారంభమయ్యాయని, వెంటనే వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలకు సైతం నోచుకొని కార్మికులకు సుప్రీకోర్టు తీర్పుననుసరించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్మికుల చట్టాలను నిర్వీర్యం చేసే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని మధ్యాహ్న భోజనం, వీఓఏ, ఆర్‌పీ, ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపులను నిలిపివేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పనిభద్రత కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీంను అమలుచేయాలని తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వీఏఓలు, అంగన్‌వాడీలు శాంతాకుమారి, అరుణ, జ్యోతి, శైలజ, లలిత, సరళ, ఖాశింబీ, కేవీపీఎస్ నాయకులు జనుమాల నాగయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కనిగిరి ధర్నాలో మాట్లాడుతున్న పీసీ కేశవరావు



మార్కాపురంలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కనిగిరి రూరల్: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీసీ కేశవరావు అన్నారు. కార్మికుల డిమాండ్స్ డే పురస్కరించుకుని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీసీ కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రంగాల్లోని కార్మికులపై రాజకీయ వేధింపులు ప్రారంభించిందన్నారు. రాజకీయ వేధింపులు తక్షణం ఆపకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, మధ్యాహ్న భోజనం, వీఓఏ, ఆర్‌పీ, ఫీల్డ్ అసిస్టెంట్‌ల తొలగింపులు ఆపాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం, గెస్ట్ ఫ్యాకల్టీ, తదితర తరగతుల కార్మికులకు పనిభద్రత కల్పించాలని, నగదు బదిలీ పథకాన్ని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ స్కీను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బషీరా, శాంత కుమారి, సుకన్య, అచ్చమ్మ, పద్మ, ప్రసాద్, లక్ష్మయ్య, ఆనంద్, చెన్నకేశవులు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్యానల్ బోర్డులు, కేబుల్ వైర్ చోరీ

పెద్దారవీడు: మండలంలో మద్దలకట్ట పంచాయతీ చాట్లమడ గ్రామంలో పొలాల్లో బోరుబావుల ప్యానల్ బోర్డులు, మోటార్ కేబుల్ వైర్లు మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రైతులు తెలిపిన ప్రకారం..పొలాల్లో మిరప, పొగ నారుపెంపకం కోసం నీటి తడులు పెడుతున్నారు. బుధవారం ఉదయం నారుకు నీటిని పెట్టేందుకు ప్యానల్ బోర్డు దగ్గరకు వెళ్లగా..కేబుల్ వైర్, ప్యానల్ కనిపించలేదు. 8 మంది ప్యానల్ బోర్డులు, 30 మంది రైతుల మోటార్ల వద్ద నుంచి ప్యానల్ బోర్డు వరకు ఉన్న కేబుల్ వైర్ దాదాపు 500 మీటర్ల పొడవునా కట్ చేసి చోరీ చేసినట్లు రైతులు వాపోయారు. వీటి విలువ దాదాపు రూ.1.50 లక్షలు ఉంటుందని రైతులు బూసా పేరయ్య, బద్రి పెద్దపుల్లయ్య, అలిశెట్టి జాలయ్య, సిరిగిరి చిన్నసుబ్బయ్య, వెంకటరమణయ్య, వెంకటనారాయణ, తోట నాగేశ్వరరావు, అలిశెట్టి శ్రీనివాసులు, మీసాల పెద్దగంగయ్య, సిరిగిరి రంగయ్య, కమతం అశోక్, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, వేమయ్య, పెద్దాంజనేయులు, చిన్నాంజనేయులు, తదితరులు తెలిపారు. వైర్లు, ప్యాన్ బోర్డులు చోరీకి గురికావడం వల్ల సాగు చేసిన మిరప, పొగనార్లు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఇటీవల కాలంలో పొలాల్లో ప్యానల్ బోర్డులు, కేబుల్ వైర్లు ఎక్కువ శాతం చోరీకి గురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన కేపీ, ఉడుముల


వైఎస్ జగన్‌తో మాజీ ఎమ్మెల్యేలు కేపీ, ఉడుముల

బేస్తవారిపేట/గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో బుధవారం ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని జగన్ సూచించారని, ఆ మేరకు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామని నేతలు పేర్కొన్నారు.

■ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంఘ నాయకుడు తొండమల్లు పుల్లయ్య వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గిద్దలూరు మండలం నరవ గ్రామానికి చెందిన పుల్లయ్యను గత ప్రభుత్వంలో నాయిబ్రాహ్మణ సంఘ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. నాయిబ్రాహ్మణుల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా నిలుస్తుందని, తామంతా పార్టీకి విధేయులుగా ఉంటామని పేర్కొన్నారు.


జగన్‌ను కలిసిన పుల్లయ్య

టీచ్ టూల్ శిక్షణ కేంద్రం పరిశీలన

ఒంగోలు: స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నతపాఠశాలలో జరుగుతున్న 9 రోజుల టీచ్ టూల్ శిక్షణ కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర బుధవారం పరిశీలించారు. ఉపాధ్యాయులతో పలు అంశాలు చర్చిస్తూ టీచ్ టూల్ కార్యక్రమం ఉపాధ్యాయుల బోధనలను మెరుగుపరిచేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. తరగతి వాతావరణం, బోధన పద్ధతులు, సామాజిక బావోద్వేగ లక్షణాలను పెంపొందించడం అవసరం అన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తోటి ఉపాధ్యాయుల బోధనలను పరిశీలించి టీచ్ యాప్‌లో నమోదుచేయాలన్నారు. దీని ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, సృజనాత్మక పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్ టి.కిషోర్‌బాబు, ఏఎంఓ రమేష్, టీచ్ టూల్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్ నాయక్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

డెంగీ ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి


డెంగీ నివారణపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో డెంగీ ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులకు సూచించారు. ప్రకాశంభవనంలో డెంగీ మాసోత్సవంపై బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఎన్‌ఎంలు కేటాయించిన గృహాలను సందర్శించి జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలను నమోదు చేయాలన్నారు. ఎక్కడైనా డెంగీ నమోదైతే వెంటనే వైద్య చికిత్స అందించి చుట్టుపక్కాల గృహాలకు వ్యాధి ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, రాకుండా ఏ జాగ్రత్తలు పాటించాలి వంటి అంశాలను ప్రజలకు వివరించి అవగాహన పెంచాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు డెంగీపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సురేష్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, కమిషనర్ జస్వంత్‌రావు ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమం కింద కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం నేపథ్యంలో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. డెంగీ, కుష్టు వ్యాధి పట్ల అవగాహన కల్పించేలా రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

లక్ష్యం మేరకు రుణాలివ్వండి

ఒంగోలు అర్బన్: జిల్లాలో అన్ని వర్గాల ప్రజలకు లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. బుధవారం ప్రకాశం భవనంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యం, వాస్తవ పంపిణీ వివరాలపై ఆరా తీశారు. సమ్మిళిత ఆర్థిక వృద్ధితోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బ్యాంకర్లు ఆ దిశగా అన్ని రంగాలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం ఎల్‌డీఎం రమేష్ గత ఆర్థిక సంవత్సరంలో రుణాల పంపిణీ లక్ష్యం రూ.17,988 కోట్లు కాగా 172.19 శాతంతో రూ.30,975 కోట్లు అందించినట్లు తెలిపారు. మొత్తం మీద ప్రాధాన్యతా రంగాలకు 143.41 శాతం, ప్రాధాన్యేతర రంగాలకు 353.33 శాతం రుణాలు అందిచనట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యా రుణాలతోపాటు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్న పథకాలతో సంబంధం ఉన్న వాటికి సత్వరమే రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రుణ ప్రణాళిక ఖరారు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ అధికారి నాగప్రవీణ్, నాబార్డ్ డీడీఎం రవికుమార్, పీడీసీసీ బ్యాంకు సీఈఓ కోటిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి గోపిచంద్, ఏపీఎంఐపీ పీడీ రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా